నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- జిల్లాలో 43 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
- పరీక్ష రాయనున్న 20,595 మంది విద్యార్థులు
- విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పిన మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, మార్చి 4 : నేటి నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలు ఈ నెల 25వ తేదీ వరకు కొనసాగనున్నాయి. రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9.05 గంటల వరకు వచ్చినా విద్యార్థులను అనుమతించనున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 43 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా.. మొత్తం 20,595 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఇందులో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 9,770 మంది ఉండగా.. ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులు 10,815 మంది విద్యార్థులు ఉన్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు సీపీ అనురాధ తెలిపారు.

సిద్దిపేటలోని బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెంబర్లు వేస్తున్న సిబ్బంది

హుస్నాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో హాల్‌టికెట్ నెంబర్లు వేస్తున్న ఇన్విజిలేటర్లు, అధ్యాపకులు

ఇంటర్ విద్యార్థులకు హరీశ్‌రావు శుభాకాంక్షలు

నేటి నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్షలు రాస్తున్న జిల్లా విద్యార్థినీ, విద్యార్థులకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆల్ ది బెస్ట్ చెప్పారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని, మీరు కష్టపడి చదివిన దాన్ని ఇష్టంతో రాసి ఉత్తీర్ణత సాధించాలని కోరుకుంటున్నానని, మీ మంచి భవిష్యత్‌కు ఇది పునాది లాంటిదన్నారు. పరీక్షలు బాగా రాసి మీ తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చి వారి కలలను నిజం చేయాలని ఆకాంక్షించారు. మంచి ఉత్తీర్ణత సాధించి మీ తల్లిదండ్రులు, మీ అధ్యాపకులకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షల నిర్వహణ

హుస్నాబాద్, మార్చి 4: హుస్నాబాద్‌లో ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు మొదలు కానున్నందున అందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆయా పరీక్షా కేంద్రాల సీఎస్‌లు తెలిపారు. పట్టణంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, టీఎస్ మోడల్ స్కూల్‌లో మొదటి, రెండో సంవత్సరం చదువుతున్న 1,307 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇంటర్ బోర్డు నేరుగా సీసీ కెమెరాల పర్యవేక్షణ చేస్తుందని బాలికల కళాశాల పరీక్షా కేంద్రం సీఎస్ రవీందర్ తెలిపారు.

మాజీ ఎంపీటీసీకి నివాళులర్పించిన ఎమ్మెల్యే పల్లా

కొమురవెల్లి, మార్చి 4: మండలంలోని ఐనాపూర్ మాజీ ఎంపీటీసీ ఆత్కూరి కనకలక్ష్మి(45) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం రాత్రి మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం ఐనాపూర్‌కు చేరుకొని మృతురాలి పార్థివదేహానికి నివాళులర్పించడంతో పాటు ఆమె భర్త జయరాములు, కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తలారి కీర్తనాకిషన్, మాజీ వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పబ్బోజు విజేందర్, మాజీ ఎంపీటీసీ కృష్ణాగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు బొంగు రాజేందర్‌రెడ్డి, పచ్చిమడ్ల స్వామిగౌడ్, మెరుగు శ్రీధర్‌బాబు, బుర్గు స్వామి పాల్గొన్నారు.

ఐనాపూర్‌లో మాజీ ఎంపీటీసీ కనకలక్ష్మి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మల్లన్నను దర్శించుకున్న హర్యానా గవర్నర్

చేర్యాల, మార్చి 4: హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ తన కటుంబ సభ్యులు, మెదక్ ఎంపీ రఘునందన్‌రావుతో కలిసి మంగళవారం కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనం కోసం ఆలయానికి వచ్చిన గవర్నర్‌తో పాటు ఎంపీకి దేవాదాయశాఖ డివిజనల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు, ఆలయ ఈవో రామాంజనేయులు అర్చకులతో ఎదురెగి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ ఆలయంలో మల్లికార్జున స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహామండపంలో ఒగ్గు పూజారులతో పట్నం వేయించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అధికారులు అర్చకులతో గవర్నర్, ఎంపీకి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, మల్లన్న జ్ఞాపికలు అందజేశారు. సిద్దిపేట సీపీ అనురాధ ఆధ్వర్యంలో పోలీసుల నుంచి మల్లన్న క్షేత్రానికి వచ్చిన గవర్నర్ గౌరవ వందనం స్వీకరించారు. కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, పాలక మండలి సభ్యులు గవర్నర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమాల్లో ఆలయ ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్లు శ్రీరాములు, సురేందర్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ఒగ్గు పూజారులు, ఆలయ సిబ్బంది, మల్లన్న ఆలయ మాజీ చైర్మన్ సంపత్, బీజేపీ జిల్లా, డివిజన్, మండల నాయకులు పాల్గొన్నారు.

దత్తాత్రేయకు జ్ఞాపిక అందజేస్తున్న రామకృష్ణారావు, రామాంజనేయులు

గవర్నర్ దర్శనం కోసం దర్శనాలు నిలిపివేత

కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనం కోసం గవర్నర్ బండారు దత్తాత్రేయ, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు వచ్చారు. సామాన్య భక్తుల దర్శనాలను ఆలయవర్గాలు నిలిపివేశాయి. హర్యానా గవర్నర్ తన కుటుంబ సభ్యులతో పాటు, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఆలయానికి రాకముందే ఆలయ అధికారులు దర్శనాలు నిలిపివేయడంతో భక్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వీవీఐపీలు, వీఐపీలు వచ్చిన సమయంలో సామాన్య భక్తులు క్యూలో ఇబ్బంది పడుతున్నారు.

కొండపోచమ్మను దర్శించుకున్న దత్తాత్రేయ

జగదేవపూర్, మార్చి 4: కొండపోచమ్మ దేవాలయం మహిమాన్వితమని హర్యానా గవర్నర్ దత్తాత్రేయ అన్నారు. మంగళవారం కొండపోచమ్మ దేవాలయాన్ని కుటుంబ సభ్యులు, మెదక్ ఎంపీ రఘునందన్‌రావుతో కలిసి ఆయన దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు కప్పరప్రసాద్, జిల్లా అధ్యక్షుడు బైరిశంకర్, పార్టీ మండల అధ్యక్షుడు అయిలయ్య యాదవ్, తీగుల్ నర్సాపూర్ మాజీ సర్పంచ్ రజితారమేశ్, జిల్లా నాయకులు ఎల్లురామ్‌రెడ్డి, కుడిక్యాల రాములు, బుద్ధ మహేందర్, శ్రీధర్, బాలరాజు, అజిత్‌రెడ్డి, శివకుమార్, ఆయా మండలాల అధ్యక్షులు సంపత్‌రెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

హరీశ్‌రావుపై విమర్శలు చేయడం సిగ్గుచేటు

చిన్నకోడూరు, మార్చి 4: ఎస్‌ఎల్‌బీసీలో ఘటన జరిగి కూలీలు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంటే సీఎం రేవంత్ స్పందించకుండా మాజీ మంత్రి హరీశ్‌రావుపై విమర్శలు చేయడం సిగ్గుచేటని సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కాముని ఉమేశ్ చంద్ర, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం వారు చిన్నకోడూరులో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రానికి సీఎం అయి 15 నెలలు గడుస్తున్నా రేవంత్ చేసింది శూన్యమన్నారు. కూలీలు సొరంగంలో ఉంటే రేవంత్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాలనపై దృష్టి పెట్టాలని హితవుపలికారు. సమావేశంలో సామల అవినాశ్, కొత్త శంకర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉమేశ్‌చంద్ర, శ్రీనివాస్

విద్యార్థులు భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలి

సిద్దిపేట టౌన్, మార్చి 4: విద్యార్థులు భవిష్యత్ వ్యవస్థాపకులుగా ఎదగాలని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత ఆకాంక్షించారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ డెవలప్‌మెంట్ అనే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మధుసూదన్, అయోధ్యరెడ్డి, సుదర్శనం పాల్గొన్నారు.

కొమ్మూరికి చిత్తశుద్ధి ఉంటే చెరువులు నింపాలి

కొమురవెల్లి, మార్చి 4 : కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే చెరువులు నింపాలని సీపీఎం మండల కార్యదర్శి తాడూరి రవీందర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ఐనాపూర్‌లో తేలు ఇస్తారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే దేవాదుల ద్వారా తపాస్‌పల్లి రిజర్వాయర్ నింపి కాలువల ద్వారా చెరువులు, కుంటలు నింపి రైతులను ఆదుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు దాసరి ప్రశాంత్, కర్రోళ్ల ఎల్లయ్య, సున్నం యాదగిరి, కనుగుల రాజు, దండు శంకర్, మల్కనీ కనకయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్

జర్నలిస్టులపై కేసులు పెట్టించడం కొమ్మూరికి తగదు

చేర్యాల, మార్చి 4: జర్నలిస్టులపై కేసులు పెట్టించడం డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేర్యాల పోలీసు యంత్రాగాన్ని ఉపయోగించుకుని అక్రమ కేసులు పెట్టి జర్నలిస్టులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్నారు. చేర్యాల పోలీస్ యంత్రాంగం అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతూ తొత్తులుగా మారడం సరికాదన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు కొంగరి వెంకట్‌మావో, మండల కార్యదర్శి బండకింది అరుణ్‌కుమార్, రవీందర్, ప్రశాంత్, రంజిత్ పాల్గొన్నారు.

చేర్యాలలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

క్విజ్ పోటీలో విద్యార్థుల ప్రతిభ

సిద్దిపేట టౌన్, మార్చి 4: అలయన్స్ క్లబ్ అంతర్జాతీయ స్థాయి ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన సైన్స్ క్విజ్ పోటీలో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబర్చారని క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ ఆత్మారాములు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. క్విజ్ పోటీలో సీనియర్ విభాగం నుంచి విశ్వేశ్వర్, సుభిక్ష, అంతర్జాతీయ స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచారన్నారు. జూనియర్ విభాగంలో అభివర్ధన్, శిరీషలు అంతర్జాతీయ స్థాయిలో ప్రథమ శ్రేణిలో నిలిచారన్నారు. విజేతలుగా నిలిచిన నలుగురికి అలయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ చేతుల మీదుగా ఒక్కొక్కరికి రూ. 25వేల బహుమతిని అందజేసి అభినందించారు. క్లబ్ జిల్లా గవర్నర్ బాలచంద్రం, సుజాత, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

నీట్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, సీపీ

సిద్దిపేట అర్బన్, మార్చి 4 : మే 4వ తేదీన నీట్ యూజీ 2025 ఎంట్రెన్స్ ఉన్నందున జిల్లా స్థాయి కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్, కలెక్టర్ మనుచౌదరి, సిద్దిపేట సీపీ అనురాధ మంగళవారం జిల్లా కేంద్రంలోని పలు విద్యా సంస్థలను పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని ప్రతిభ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిద్ధార్థ హైస్కూల్, ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాల, వికాస్ హైస్కూల్‌ను క్షేత్ర స్థాయిలో నేషనల్ టెస్టింగ్ కమిటీ ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం నీట్ పరీక్షకు కావాల్సిన సదుపాయాలను పరిశీలించారు. పరిశీలించిన విద్యాసంస్థల నుంచి మూడు కేంద్రాలను ఎంపిక చేసి నివేదికను పైఅధికారులకు పంపిస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ, ఇతర అధికారులు

మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఈనెల 8న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట సీపీ అనురాధ మంగళవారం ప్రకటనలో తెలిపారు. రాజీమార్గం రాజమార్గమని, చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకొని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బులను వృథా చేసుకోవద్దని, జ్యుడీషియల్ డిపార్ట్‌మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని ఆమె తెలిపారు.

వంతెనకు అడ్డంగా ఉన్న వైర్ల తొలగింపు

చేర్యాల, మార్చి 4: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కృషితో మండలంలోని కడవేర్గు గ్రామ సమీపంలో నూతనంగా బ్రిడ్జి నిర్మాణం చివరి దశకు చేరుకుంది. నూతనంగా నిర్మించిన వంతెన ప్రారంభోత్సవానికి అడ్డంకిగా ఉన్న 33 కేవీ విద్యుత్ లైన్ తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీటీసీ గదరాజు యాదగిరితో పాటు ఆయా గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే పల్లా దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన విద్యుత్ అధికారులతో మాట్లాడి వంతెన వద్ద అడ్డంకిగా ఉన్న 33కేవీ లైన్‌ను వెంటనే తొలగించాలని ఆదేశించారు. మంగళవారం విద్యుత్‌శాఖ అధికారులు 33కేవీ విద్యుత్ లైన్ మరో మార్గం గుండా వెళ్లేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో ఆయా గ్రామా ల ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ లైన్ తొలగిస్తున్న అధికారులు, పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి

గజ్వేల్, మార్చి 4: కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య కోరారు. మంగళవారం కార్మికశాఖ ఉప కమిషనర్ రవీందర్‌రెడ్డి గజ్వేల్‌కు వచ్చిన సందర్భంగా గజ్వేల్ ఇండస్ట్రియల్ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతన జీవోల కాలం ముగిసినా వాటిని కొనసాగించడం జరుగుతుందని, వెంటనే వాటిని సవరించాలని కోరారు. కార్మికుల జీవనావసరాలు, విద్యా, వైద్యం, ఇంటి అద్దెల ఖర్చులు పెరుగుతున్నాయన్నారు. గజ్వేల్ ప్రాంతంలోని పరిశ్రమల్లో కనీస వేతనాలు అమలు చేసేలా చూడాలన్నారు. అనంతరం ఆర్డీవో చంద్రకళకు గజ్వేల్ రెవెన్యూ డివిజన్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో స్వామి, రాములు, జహంగీర్, ఆంజనేయులు, యాదగిరి, స్వామి, కనకయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కొమురవెల్లి, మార్చి 4: వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి రాధిక రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని మర్రిముచ్చాలలో కొమురవెల్లి ఏవో వెంకట్రావమ్మ, ఏఈవో రమ్యతో కలిసి వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంటలో అగ్గి తెగులు, కాండం తొలిచే పరుగు ఉధృతి అధికంగా ఉందన్నారు. వాటి నివారణకు టై స్లోక్లోజోన్ మందును 0.6 గ్రాములు లేదా కాసుగామైసిన్ 1.5 మిల్లీలీటర్లు లేదా ఐసోప్రో తయోలిన్ 1.5 మిల్లీలీటర్ల చొప్పున లీటరు నీటిలో కలిపి రెండు సార్లు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మర్రిముచ్చాలలో వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రాధిక

ఎస్సీ వర్గీకరణ కోసం దండోరా మోగించాలి

హుస్నాబాద్‌టౌన్, మార్చి 4: ఎస్సీ వర్గీకరణ సాధించేందుకు ప్రతి మండల కేంద్రంలో డప్పుల దండోరా మోగించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెర్క పరశురాములు మాదిగ పిలుపునిచ్చారు. హుస్నాబాద్‌లో మంగళవారం ఎమ్మార్పీఎస్, అనుబంధసంఘాల నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి మాట్ల వెంకటస్వామి అధ్యక్షత వహించగా, జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కపల్లి రాజు, నాయకులు జెరిపోతుల లక్ష్మణ్, ముక్కెర సంపత్, ఎనగందుల లక్ష్మీనారాయణ, అశోక్, శ్యామ్‌కిరణ్, అనల్, వెంకట్, రవి, శ్రీనివాస్, సురేశ్ పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

టీచర్స్ ఎమ్మెల్సీగా శ్రీపాల్‌రెడ్డి గెలుపుపై హర్షం

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 4: వరంగల్–నల్లగొండ–ఖమ్మం నియోజకవర్గ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలో పీఆర్టీయూ(టీఎస్) అభ్యర్థి పింగళి శ్రీపాల్‌రెడ్డి ఘన విజయం సాధించడం పై పీఆర్టీయూ(టీఎస్) మద్దూరు మండల శాఖ ఆధ్వర్యంలో మద్దూరు మండల కేంద్రంలో మంగళవారం ఉపాధ్యాయులు సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ(టీఎస్) మద్దూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామిడి శ్రీనివాస్‌రెడ్డి, చల్లా కరుణాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు పాల్గొన్నారు.

మద్దూరులో మాట్లాడుతున్న పీఆర్టీయూ నాయకులు

సమస్యల పరిష్కారానికి శ్రీపాల్‌రెడ్డి కృషి

చేర్యాల, మార్చి 4 : విద్యారంగ సమస్యలు, ఉపాధ్యాయుల సమస్యల పట్ల అవగాహన ఉన్న శ్రీపాల్‌రెడ్డి ఎమ్మెల్సీగా విజయం సాధించడం హర్షణీయమని పీఆర్టీయూ (టీఎస్) మండల అధ్యక్షుడు కేవీఎన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కామిడి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జరిగిన సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నమోదులో చురుగ్గా పాల్గొని ఇటీవల మృతి చెందిన ధర్మారెడ్డికి శ్రీపాల్‌రెడ్డి విజయాన్ని అంకితం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పీఆర్టీయూ నాయకులు బాణాసంచా పేల్చి సంబురాలు చేసుకున్నారు.

రుణ సౌకర్యం కల్పించాలి

సిద్దిపేట టౌన్, మార్చి 4: రైతులకు దీర్ఘకాలిక రుణ సౌకర్యం కల్పించాలని బ్యాంకు అధికారులను జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ స్వాతిరెడ్డి ఆదేశించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కోర్టు సమావేశం మందిరంలో అగ్రికల్చర్ లోన్స్, పంట రుణమాఫీపై బ్యాంకు మేనేజర్స్, అగ్రికల్చర్ అధికారులు, రైతు సంఘాల నేతలతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతిరెడ్డి మాట్లాడుతూ.. రైతులకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ఆసక్తి చూపించడం లేదని రైతు సంఘం నేత శ్రీహరిరావు పిటిషన్ వేశారన్నారు. హైకోర్టు ఇచ్చిన అదేశాలను బ్యాంకు అధికారులు పాటించి రుణాలు ఇవ్వాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

హుస్నాబాద్, మార్చి 4: నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కృషి చేస్తున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం హుస్నాబాద్ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని పలు మండలాల సమస్యలపై ఆయా మండలాల పార్టీ కార్యకర్తలు, నాయకులు, జేఏసీ నాయకులతో కలిసి సమీక్ష నిర్వహించారు. పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలు ఏ సమస్య ఉన్నా నేరుగా క్యాంపు కార్యాలయానికి వచ్చి తెలియజేయాలని, సమస్యను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న మంత్రి పొన్నం

యూనియన్ బ్యాంక్ రుణమేళా

సిద్దిపేట అర్బన్, మార్చి 4: మహిళలను వ్యాపార వేత్తలుగా చేయడమే లక్ష్యంగా వారికి ఎలాంటి తనఖాలు లేకుండా రుణాలు మంజూరు చేస్తున్నామని యూనియన్ బ్యాంక్ హైదరాబాద్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ గామి తెలిపారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని విపంచి కళానిలయంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మెగా మైక్రో, స్మాల్,మీడియం ఎంటర్ ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ) రుణ మేళా జరిగింది. ఎంఎస్‌ఎంఈలకు వివిధ పథకాల ద్వారా రుణాలను ఏ విధంగా అందిస్తున్నారో వంటి అంశాలను కస్టమర్లకు యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు వివరించారు. నిరుపేదలను ఆదుకునేందుకు యూనియన్ బ్యాంక్ అనేక రకాల పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రూ.25 కోట్ల క్రెడిట్ సౌకర్యాలు మంజూరు చేయడంతో పాటు రూ.60 కోట్లకు సంబంధించిన వివిధ దరఖాస్తులకు ప్రాథమిక ఆమోదం ఇచ్చినట్లు బ్యాంక్ అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో రీజనల్ హెడ్ ఈ.వికాస్, లీడ్ డిస్ట్రిక్స్ మేనేజర్ బి.హరిబాబు, డిప్యూటీ రీజినల్ హెడ్, స్థానిక బ్రాంచ్ మేనేజర్లు, ఎంఎస్‌ఎంఈ రుణగ్రహీతలు పాల్గొన్నారు.

రుణగ్రహీతలకు లోన్ మంజూరు చెక్కు అందజేస్తున్న బ్యాంక్ ప్రతినిధులు

రుణాలకు రైతులు దరఖాస్తు చేసుకోవాలి

సిద్దిపేట టౌన్, మార్చి 4 : రైతులను ప్రైవేట్ అపుల ఊబి నుంచి బయటపడేసేందుకు ఆర్‌బీఐ బ్యాంకర్లకు మార్గదర్శకాలు జారీ చేసిందని రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరి రావు అన్నారు.సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రైతు రక్షణ సమితి నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. రైతులందరూ రుణాల కోసం సంబంధిత బ్యాంకుల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. రైతు సంఘం నేతలు రామలింగారెడ్డి, రాజేశం, శ్రీనివాస్, మల్లిఖార్జున్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, భూపతిరెడ్డి, లక్ష్మయ్య, సంతోష్‌రెడ్డి, అంజిరెడ్డి, రాజిరెడ్డి, లింగారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మాధవరెడ్డి, దేవయ్య, బాలనర్సు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

జగదేవపూర్, మార్చి 4: మండలంలోని 29 గ్రామాల్లో 2023–24 సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనులపై 15వ విడత సామాజిక తనిఖీ చేపట్టినట్లు ప్రిసైడింగ్ అధికారి, అడిషనల్ డీఆర్డీవో బాలకృష్ణ తెలిపారు. మండల వ్యాప్తంగా సోషల్ అడిట్ చేపట్టి మంగళవారం మండల కేంద్రంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో చేపట్టిన సోషల్ నివేదికలను డీఆర్పీలు వినిపించగా మొత్తం మండలంలో 4.20 కోట్ల పనులు చేపట్టినట్లు వివరించారు. పనులను తనిఖీ చేయగా రూ.1.23 లక్షలు రికవరీ అయ్యాయని, రూ. 57 వేల ఫైన్ విధించినట్లు చెప్పారు. అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీడీవో యాదగిరి, ఈసీచారి, టీఏలు తిరుపతిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీలు, ఫీల్డుఅసిస్టెంట్లు పాల్గొన్నారు.

మర్పడగ స్కూల్‌లో డీఈవో ఆకస్మిక తనిఖీ

కొండపాక(కుకనూరుపల్లి), మార్చి 4: కొండపాక మండలంలోని మర్పడగ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం డీఈవో ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టెన్త్ విద్యార్థుల గదికి వెళ్లిన ఆయన విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. టెన్త్‌లో 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మందుబాబులకు కౌన్సిలింగ్

సిద్దిపేట టౌన్, మార్చి 4: మద్యం తాగి వాహనాలు నడిపిన మందుబాబులకు పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. సిద్దిపేట ట్రాఫిక్ సర్కిల్ పరిధిలో మంగళవారం సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 155 మందిని పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిని పీఎస్‌కు తరలించి కౌన్సిలింగ్ నిర్వహించి మద్యం తాగి వాహనాలు నడపమని ప్రతిజ్ఞ చేయించి కోర్టుకు పంపించారు. కార్యక్రమంలో ఎస్సై గోపాల్‌రెడ్డి, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

నర్సాయపల్లిలో విచారణ

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 4: మద్దూరు మండలం నర్సాయపల్లిలో డబుల్ బెడ్రూమ్ ఇండ్ల భూమి ఆక్రమణపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో మంగళవారం మద్దూరు తహసీల్దార్ ఏజీ రహీం గ్రామాన్ని సందర్శించి ప్రాథమిక విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గతంలో సర్వేనెంబర్ 88లో డబుల్ బెడ్రూమ్ ఇండ్ల నిర్మాణం కోసం భూమిని దానం చేసినట్లు తెలిపారు. ఇటీవల ఆ భూమి ఆక్రమణకు గురైతుందని కొంత మంది గ్రామస్తులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మరోమారు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రమేశ్, జూనియర్ అసిస్టెంట్ వెంకటేశం పాల్గొన్నారు.

రోబోటిక్స్ ప్రదర్శన

సిద్దిపేట టౌన్, మార్చి 4: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోహం అకాడమీ సౌజన్యంతో మంగళవారం రోబోటిక్స్ జిల్లా స్థాయి ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకున్నది.రోబోటిక్స్ ప్రదర్శనను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత ప్రారంభించారు. ప్రదర్శనలో 14 ప్రభుత్వ, రెండు ప్రైవేట్ పాఠశాలల నుంచి 40 ఎగ్జిబిట్స్ ప్రదర్శించారు. ప్రదర్శనలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలచిన ఎగ్జిబిట్స్ సమూనాలకు కృషి కల్ప ఎన్‌జీవో సీఈవో పాటిల్ రూ.5వేల నగదు అందజేశారు. నిర్వహక కార్యదర్శి డాక్టర్ మధుసూదన్, అధ్యాపకులు కృష్ణయ్య, అయోధ్యరెడ్డి, సుదర్శనం, రామస్వామి, సత్యనారాయణరెడ్డి, రజని, మహేశ్‌కుమార్, సౌమ్య, భైరయ్య పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

సిద్దిపేట అర్బన్, మార్చి 4: వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్న ఘటన మండలంలోని ఎన్సాన్‌పల్లి గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎన్సాన్‌పల్లి గ్రామ శివారులోని ఓ ఇంటిలో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేశారు. నంగునూరు మండలం పాలమాకులకు చెందిన విటుడు శేఖర్‌తో పాటు నిర్వాహకురాలు, మరో మహిళను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1700, మూడు కండోమ్ ప్యాకెట్లు, మూడు సెల్‌ఫోన్లు, ఒక మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారా పట్టివేత

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 4: మద్దూరు మండలంలోని వంగపల్లి వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ఓ వ్యక్తి వద్ద నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్సై పి. సురేశ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ధూళిమిట్ట మండలం హనుమతండాకు చెందిన ఇస్లావత్ రవి ద్విచక్ర వాహనం మీద నాటుసారా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. అతని వద్ద ఎనిమిది లీటర్ల నాటుసారాతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం అతన్ని అరెస్టు చేసి కేసునమోదు చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ ఎస్సైలు సురేశ్, సువర్ణ, కానిస్టేబుళ్లు రవి, నర్సింహులు, ప్రణీత్, సంపత్ పాల్గొన్నారు.

తెలంగాణ గ్రామీణ బ్యాంక్
ప్రధాన కార్యాలయం: హైదరాబాద్ | రీజనల్ బిజినెస్ కార్యాలయం: సిద్దిపేట
లీజు కొరకు బ్రాంచ్ ప్రాంగణం కావలెను

క్ర.సంఖ్య	శాఖ పేరు	శాఖ కోడ్	సంప్రదించవలసిన నెంబరు
1	చేగుంట	8108	9490157366
2	ఎర్రవెల్లి	8211	8331043821
3	గజ్వేల్	8160	9440903965
4	జగదేవ్‌పూర్	8181	9490157424
5	కోటిలింగాల	8187	8331011464
6	కుక్‌నూర్‌పల్లి	8111	9490157369
7	మంబోజిపల్లి	8185	7382632695
8	నాచారం	8127	9490157379
9	నార్సింగి	8190	8331010434
10	సిద్దిపేట	8159	9440903964
11	తూప్రాన్	8168	9490157401

పైన తెలుపబడిన ఏరియా, 1200 నుండి 2200 చ॥అ॥ల కనీసం విస్తీర్ణం, గ్రౌండ్ ఫ్లోర్ ప్రాధాన్యం, పార్కింగ్ సౌకర్యం గల ఆవరణ లీజుకు కావలెను. నిర్మాణంలో ఉన్నవి కూడా పరిశీలించబడును. ఆసక్తి గల పార్టీలు సంబంధిత అన్ని డాక్యుమెంట్స్‌లతో రీజినల్ బిజినెస్ కార్యాలయం / బ్రాంచ్‌ను తేది. 09.03.2025 న లేదా అంతకుముందుగా గాని సంప్రదించగలరు. సం/- రీజినల్ మేనేజర్, సిద్దిపేట్
ఫోన్ నెం. 9440903932 / 9491510434